అప్పుడే స్కూలు నుంచి వచ్చి ఇంట్లోకి అడుగు పెట్టిన ఆనందరావు భార్య విచారంగా ఉన్నట్టు గమనించి "శాంతా! ఏం అలా వున్నావ్?" అని అడిగాడు.

"ఏం చెప్పేది? ఇంతకీ - మన ఖర్మ యిలా కాలింది" అంటూ నిట్టూర్చింది శాంత.

"అసలు సంగతేమిటి?"



"ఏమిటా? మన పనిమనిషి రంగమ్మ యింక పనిలోకి రాదట!"

"ఎందుకని? ఎందుకు రాదట?" ఆత్రుతతో ప్రశ్నించాడు.

"మన పక్కింటి వాళ్ళ దగ్గర పనిచేసే అలివేలు రంగమ్మకి మనమీద ఉన్నవి, లేనివి కల్పించి చెప్పి విషం నూరిపోసింది. మనం అదిట, ఇదిట-మనకు శుచీ శుభ్రతా లేవట!"


"చెప్పిన దానికి బుద్ధిలేకపోతే విన్న రంగమ్మకి బుద్దేమయింది?"

"ఏమవుతుంది? అది తిన్నగా వచ్చి నా మొహం మీదే 'అమ్మా! నేనింక మీ యింట్లోకి పనికిరాను. మీరు తక్కువ కులపోళ్ళటగా! మీ యింట్లో పన్జెయ్యటం మానకపోతే నాకు వేరే యిళ్ళల్లో పనులు దొరకవు. ఉన్నవి కూడా పోతాయి!' అంది."

"ఆఁ! అంతమాటందా?" ఆశ్చర్యపోయాడు ఆనందరావు. పొరుగింటి రామయ్యశెట్టి, ఆ పక్కనే ఉన్న సుందరరామశాస్త్రి వెంటనే అతని మనసులో

# వెలి

పంతగడ గణేష్ శంకర విద్యార్థి




మెదిలారు.

తను యీ వూరొచ్చి ఓ సంవత్సరం కావస్తూంది. ఇక్కడి జెడ్.పి హైస్కూలుకు ట్రాన్స్ఫరై తను యీ వూరొచ్చిన కొత్తలో ఓ అద్దెకొంప సంపాదించడానికి నెలరోజులు శ్రమ పడవలసి వచ్చింది. అగ్రహారంలో తనకు ఇల్లు దొరకదు. అదలా ఉంచి యీ ఊళ్ళో రాజుల వీధి, కాపుల వీధి, వైశ్యుల వీధి అని వేటికవి ప్రత్యేకంగా ఉన్నాయి. చివరకు అన్నిరకాల కులాలవారు నివసిస్తున్న ఓ వీధిలో ఓ చిన్న అబద్ధమాడి ఎలాగైతేనేం ఇల్లు సంపాదించాడు. మరో అబద్ధమాడితేనేగాని పనిమనిషి దొరకలేదు. చివరికా పనిమనిషి యిలా అయిందన్న మాట! అయితే ఇప్పుడేమిటి కర్తవ్యం? ఇప్పుడేం చేయాలి?

"ఏమండి? ఏమిటలా తలపట్టుక్కూర్చున్నారు? ఎందుకంత దిగాలు పడిపోతారు? ఈ ఊళ్ళో యింక పనిమనుషులు దొరకరా అది రాకపోతే?" అంది శాంత ముఖం చిట్లిస్తూ.

'పిచ్చిశాంత!' అనుకున్నాడు ఆనందరావు మనస్సులో. ఏవిటో అంత నమ్మకం! ఈ సంఘంలో ఉన్న కుళ్ళు, యీ మనుషుల్లో ఉన్న స్వార్థం శాంతకెలా అర్థమవుతాయి? అసలు విషయం ఆమెకు తెలియదు. నిన్నగాక మొన్న దీపావళి పండగనాడు ఇంటిముంగిట తోరణాలు కట్టనందుకు, లక్ష్మీపూజ చేయనందుకు, టపాకాయలు కాల్చనందుకు రామయ్యశెట్టి, సుందరరామశాస్త్రి వింతగా చూశారు. శెట్టి భార్య, శాస్త్రి భార్య శాంతను పురుగుకన్నా హీనంగా చూశారు. కాని ఆ విషయాల్ని తాను పట్టించుకోలేదు. మరి ఇప్పుడు — ?

అలా ఆలోచిస్తూ మనశ్శాంతి లేకుండా ఆ రాత్రంతా గడిపాడు ఆనందరావు.

ఆ మర్నాడు తిరిగి పనిమనుషులకోసం వేట ప్రారంభించాడు. ఎక్కడా దొరకలేదు. కారణం ఆ ఊళ్ళో పని మనుషుల కొరత కాదు. అది ఆనందరావు కులం! మనిషికీ మనిషికీ మధ్య కనపడని అడ్డుగోడగా నిలిచిన కులం. భయంకరమైన యీ కులతత్వం మనిషికి మనిషికీ మధ్య అంతరాలు సృష్టించింది. ఆనందరావు హరిజనుడు. ఈ సమాజంలో హరిజనుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకేకాదు, శూద్రులకు కూడా చులకనే. చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి - అందరికీ హరిజనుడు లోకువే!

పనిమనిషి దొరకక పోవడంవల్ల శాంతకు చాలా యిబ్బంది యేర్పడింది. అసలే ఆమె బలహీనురాలు. ఈమధ్య కొన్నిరోజులుగా ఒంట్లో బావుండడం లేదు. పురుగుమీద పుట్రలా రంగమ్మ హఠాత్తుగా మానేయడంతో శాంత పరిస్థితి దెబ్బతింది. పనిమనిషి లేకపోవడం ఇరుగూ పొరుగూ గమనించారు. కాని ఎవ్వరూ మాట్లాడరు. సహాయపడరు. సానుభూతి ప్రదర్శించరు. వాళ్ళ-అంటే శాంత, ఆనందరావుల బాగోగులు ఎవరికీ అవసరంలేదు.

అలా కొన్ని రోజులు గడిచాయి.

ఓ రోజున శాంత ఆనందరావుతో "ఏమండీ! మనం యీ ఇల్లు ఖాళీ చేసి వేరే ఇల్లు ఎక్కడైనా చూసుకుందామండీ!" అన్నది.

"ఏం అంత అవసరమేమొచ్చింది?" అని ప్రశ్నించాడు భర్త.

"తెలియనట్టడుగుతారేం? ఇరుగూపొరుగూ మనల్ని ఎలా చూస్తున్నారో మీకు మాత్రం తెలియదా? ఏమిటో యీ మనుషుల స్వభావాలు? మొన్న ఆ శాస్త్రిగారి భార్య మనింటికి వచ్చినప్పుడు టేబుల్ మీద ఉన్న క్రీస్తు, బుద్ధుడు బొమ్మల్ని ఎగాదిగా చూసింది. నిన్న ఆ శెట్టిగారి తల్లి 'మీకు పూజలు, పునస్కారాలు ఉండవా? మీరు కిరస్తానీ వాళ్ళా?' అని అడిగింది నా ముఖం మీదే!"

"అంత మాత్రానికే బాధెందుకు?"

"బాగుందండీ! మీకెందుకుంటుంది బాధ? క్రీస్తు బొమ్మ నా యింట్లో పెట్టుకోవడం నేను చేసిన పొరబాటా? పూజలు, వ్రతాలూ, నోములూ నాకిష్టం లేవు. నేను చేయను. బొట్టుకూడా నా కిష్టమయినప్పుడు పెట్టుకుంటాను. లోకం మెప్పుకోసం మాత్రం నాకిష్టంలేని పనులు ససేమిరా చేయను! అందుకే యిల్లు ఖాళీ చేద్దామంటున్నాను!!" అన్నది శాంత కోపంగా.

"సొసైటీలో బతుకుతున్నప్పుడు నలుగురి అభిరుచులకి అనుగుణంగా మనం తయారుకాకూడదా?" ప్రశ్నించాడు.

"మన అభిరుచుల్ని అవతలివాళ్ళు కూడా గౌరవించాలి గదండీ! మనం పూర్తి శాకాహారులం కాదు. జిహ్వాచాపల్యం కొద్దీ ఎప్పుడైనా ఓ పావుకిలో మాంసం తెచ్చుకొని వండుకుంటే పెద్ద తంటా ఆ పై వాళ్ళతో! ఆ పై పోర్షనులో ఉన్న శర్మగారు, ఆయన భార్య 'వాసన వాసన' అంటూ విరుచుకపడతారు. ఓ కోడిని కొయ్యడానికి వీలులేదు. చేపలు శుభ్రం చేసుకోవడానికి వీల్లేదు! ఏవిటండీ యీ ఖర్మ మనకి?"

"శాంతా! ఛాందసుల మధ్య ఉన్నంతవరకు యీ సమస్యలు మనకు తప్పవు! మనం వెల్లని రూపాయిలం శాంతా! వెల్లని రూపాయిలం!" అని నిట్టూర్చాడు ఆనందరావు.

"అయితే - మనం 'వెలామ్మణీ' అయే చోటెక్కడా లేదంటారా?" అంది శాంత బాధగా.

"ఆ చోటు కోసమే వెతుకుతున్నాను శాంతా!" అని ఇంక అక్కడ ఉండలేక బయటికి వచ్చాడు ఆనందరావు.

రోడ్డు వెంబడి నడుస్తున్నాడు. బరువెక్కిన హృదయంతో ముందుకు నడుస్తున్నాడు. గ్రామ పంచాయతీ ఆఫీసు ఆవరణలోని లౌడ్ స్పీకర్ నుండి పాట వినబడుతూవుంది:

"అంటరాని వారెవరంటే
మా వెంట రానివారే!
హరిజనులెవరంటే
మన అనుంగు సోదరులే...."

"మాస్టారూ!!"

కేకవిని ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూశాడు ఆనందరావు. యాదగిరి!


యాదగిరి ఆనందరావు కొలీగ్. ఒకే స్కూలులో ఇద్దరూ పనిచేస్తున్నారు. అభ్యుదయ భావాలుగల యాదగిరికి ఆనందరావంటే ఎంతో గౌరవం, అభిమానం.

"మాస్టారూ! ఏమిటలా సీరియస్‌గా ఆలోచిస్తూ వెళ్ళిపోతున్నారు?" అంటూ ప్రశ్నించాడు యాదగిరి.

యాదగిరిని తన ఆత్మీయుడుగా భావించే ఆనందరావు తన సమస్యలన్నీ అతనికి వివరించాడు.

"ఈ మాత్రానికే అంత అధైర్యపడితే ఎలా? కాస్త ఓపిక పట్టండి. కొన్ని సమస్యలకి కాలమే మంచి పరిష్కారాన్ని సూచిస్తుందని నేననుకుంటాను" అన్నాడు యాదగిరి అంతా ఓపిగ్గా విని.

అలా యిద్దరూ మాట్లాడుకుంటూ వెళుతుండగా ఓ కుర్రాడు 'రయ్యి'న సైకిల్‌మీద వచ్చి ఆనందరావు దగ్గర ఆగి "మా సేటు నిన్ను తోలుక రమ్మన్నాడు. ఇప్పుడొస్తావా?" అని అడిగాడు.




"ఇప్పుడేనా? సరే! వస్తాను! నువ్వు పద!" అని చెప్పి ఆ కుర్రవాణ్ణి పంపించేశాడు ఆనందరావు.

"ఇతనెవరండీ?" అడిగాడు యాదగిరి.

"మా యింటి ఓనరు దగ్గర పనిచేసే కుర్రవాడు లెండి!"

"ఓహో! అయితే ఆయన మిమ్మల్ని రమ్మని ఇప్పుడెందుకు కబురు చేసినట్టో?"

"ఏమో! నాకేదో అనుమానంగా ఉంది."

"పదండి సార్! నేనుకూడా వస్తాను!" అన్నాడు యాదగిరి.

ఇద్దరూ కలిసి సేఠ్ శరభలింగం వారి యింటికి వెళ్ళారు. బయట వరండాలో కూర్చున్నారు. కాసేపటికి శరభలింగం బయటికివచ్చాడు. వస్తూనే ఆనందరావును చూసి అగ్గిమీద గుగ్గిలమైపోయాడు.

"ఏమయ్యా! నీవు యింటిలో జేరేముందు 'నీవు ఎవరు?' 'ఏమిటి?' అని నేను అడిగినాన లేదా? అప్పుడు నువ్వు నాకు ఏమి జెప్పినవు?"

సేఠ్ మాటలు వినగానే అదిరిపోయాడు ఆనందరావు. మౌనంగా తలవంచుకొని వెంటనే జవాబు యివ్వలేకపోయాడు. నిజమే. పొరబాటు ఆనందరావుదే.

సేఠ్ యాదగిరి వంక చూసి "సూడవయ్యా మాస్టారు గీనను. మీరే వర్ణస్తులని అడిగిన. మేము వైశ్యులమని జెప్పిండు. నేను నిజమే గామోల్లనుకున్న! ఇల్లిచ్చిన! గీయన ఎవరో నాకు మొన్న దెలిసింది! ఇది మోసంకాదా?" అని అడిగాడు కోపంగా.

"అయితే—గిప్పుడేమంటరు?" అడిగాడు యాదగిరి.

"ఈయన నేను 'ఫలానా' అని ముందే జెప్పంటే బాగుండెడిది గదా!"

"అంటే—ఏమిటి మీ ఉద్దేశ్యం?" అన్నాడు ఆనందరావు ధైర్యం తెచ్చుకుని.

"అంటే ఏమిటో యింకా యివరంగా జెప్పాల్నా? నువు కిరస్తానీ మాలోడివని ముందే దెలిస్తే నీకు యిల్లు అద్దెకిచ్చేవాడినా?" అన్నాడు శరభలింగం చిందులు తొక్కుతూ.

"మీకు అద్దె ముఖ్యమా? అద్దెకుండే వాళ్ళ కులం ముఖ్యమా?" అడిగాడు యాదగిరి.

"మాకు కులమే ముఖ్యం! ఆ పోర్షను మీద మాకు అద్దె రాకపోయినా ఫరవాలేదు. అది ఖాళీగా ఉన్నా మాకు బాధలేదు!" అన్నాడు సేఠ్ నిష్కర్షగా.

"ఏదో పాపం! అతను హరిజనుడని తెలిస్తే మీరు ఆ పోర్షను అద్దెకివ్వరని ఏదో చిన్న అబద్ధమాడినాడు గాబోలు!- ఇప్పుడు మీకు కలిగిన నష్టమేంది?" నచ్చజెప్పబోయాడు యాదగిరి.

"అది నాకు నష్టమో, కష్టమో నీకు సమజైత దా? అయినా—నీతో నాకేమిటి గాని-ఇదిగో ఆనందరావు! నువు వెంటనే ఇల్లు ఖాళీ జెయ్యి! ఇదే నేజెప్తుండా!" అని కళ్ళెర్రజేశాడు శరభలింగం.

ఆనందరావుకు ఏం చెప్పాలో తోచలేదు.

"చూడు సేటూ!! ఏదో అయిపోయింది! ఇప్పుడతన్ని హఠాత్తుగా ఇల్లు ఖాళీ చేయమంటే ఎక్కడికి పోతాడు చెప్పు? మారడానికైనా అతనికి వేరే యిల్లు దొరకాలిగదా!" అంటూ సముదాయించబోయాడు యాదగిరి.

శరభలింగం మనస్సు మారలేదు. అతడు తను పట్టిన పట్టు విడవలేదు. ఏమయినా సరే యిల్లు ఖాళీ చేయవలసిందేనన్నాడు. ఎంతో ప్రాధేయపడగా చివరికి యిల్లు ఖాళీచేయడానికి ఆనందరావుకు వారం రోజులు గడువిచ్చాడు.

***

వారం రోజులలో ఆరురోజులు గడిచిపోయినై.

ఏడవరోజు.

ఆనందరావుకు వేరొక యిల్లు ఊళ్ళో యెక్కడా అద్దెకు దొరకలేదు. శరభలింగం ఆనందరావును గురించి ఆ ఊళ్ళోని ప్రముఖులకు దుష్ప్రచారం చెయ్యడంవల్ల ఎవ్వరూ యిల్లు యివ్వడానికి ముందుకు రాలేదు.

అయోమయ పరిస్థితిలో పడి దిక్కుతోచని విధంగా ఉన్న ఆనందరావును చూసి అతని భార్య అతనికి ధైర్యం చెప్పడానికి ప్రయత్నించింది.

"ఏమండీ! మీరెంత వెదికినా యీ ఊళ్ళో మనకి యిల్లు దొరికే సూచనలేవీ కనిపించడంలేదు. ఊళ్ళోనే ఉండాలని ఏముంది? ఊరి బయట కాపురముందాం! ఊళ్ళోని పెద్దమనుషుల మధ్య ఉండే కుళ్ళు, కార్పణ్యం కంటె అది మంచిది

కాదా!" అంది.

"శాంతా! ఊరు నీకు కేవలం 'ఊరు'. కాని నాకు సమాజం!! హిందూ సమాజం. నేను హరిజనుణ్ణి. అంటే హరిభక్తుణ్ణి. వైష్ణవుణ్ణి. అంటే హిందువును! హిందూ సమాజంలో బ్రతకడం హిందువుగా నా హక్కు. దాన్ని నేను వదులుకోలేను. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు నాసోదరులు. హిందూ సోదరులు!" అన్నాడు సగర్వంగా.

"ఎంత పిచ్చివారండీ! ఈ ఊరు మీకు సమాజమా? ఈ సమాజంలో మీకు చోటుందా? సాటివారిలో సమాన గౌరవముందా? ఉంటే అది ఏపాటిది చెప్పండి?

మిమ్మల్ని పశువుకన్నా హీనంగా చూసే యీ ఛాందసుల మధ్య మీరెందుకు బ్రతకాలి? మనిషిని మనిషిగా చూసే సమాజం యెక్కడుందో అక్కడికే మనం పోదాం! దుష్టులకు దూరంగా ఉండాలన్నారు మన పెద్దలు. "కసరి బుసకొట్టునాతని గాలిసోక, నాల్గు పడగల హైందవనాగరాజు" అన్న జాషువా మాటల్ని మర్చిపోయారా? ఇక లేవండి!!" అని ఆనందరావు భుజం తట్టింది శాంత.

"అర్థమయింది శాంతా! నాకు కర్తవ్యాన్ని బోధించావు. నాకు కొత్త చైతన్యాన్ని యిచ్చావు!" అని శాంతను అభినందించాడు ఆనందరావు.

ఆ మర్నాడు ఉదయాన్నే బయలుదేరి వెళ్ళి ఊరికి దూరంగా ఉన్న హరిజనవాడను సందర్శించి వచ్చాడు. మునిపల్లెకు ఏ విధంగానూ తీసిపోని ఆ మాలపల్లె ఆనందరావులో నూతనోత్తేజాన్ని సృష్టించింది. గ్రామ పెద్దను 'పెద్దమాల' అంటారు. ఆయన్ని కలుసుకుని తన సంగతంతా వివరంగా చెప్పాడు ఆనందరావు. ఆయనెంతో సంతోషించి స్థానికులతో మాట్లాడి వారికి అతన్ని పరిచయం చేశాడు. వారి పూరిగుడిసెల్లో ఓ గుడిసె ఆనందరావుకు కేటాయించబడింది.

సంతోషంతో యింటికి తిరిగివచ్చాడు ఆనందరావు. ఎదురైన యాదగిరికి విజయగర్వంతో జరిగిందంతా చెప్పాడు. యాదగిరి సంతోషానికి అంతులేదు.

ఆనందరావు తరపున యాదగిరి సేఠ్ శరభలింగం వద్దకు వెళ్ళి, ఆనందరావు ఇల్లు ఖాళీచేస్తున్నట్టు తెలియజేశాడు. ఆ వార్త వినగానే శరభలింగం ముఖం వివర్ణమయింది. ఈర్ష్యాద్వేషాలు అతని కళ్ళలో ప్రస్ఫుటమయ్యాయి.

యాదగిరి సేఠ్‌తో ఇలా అన్నాడు:

"సేటూ! ఆనందరావు వెళ్ళిపోతున్నాడు. అతను వెళ్ళిపోతున్నందుకు నీవు సంతోషిస్తున్నావా? బాధపడ్తున్నావా? అత నీవూరే వొదిలిపెట్టి వెళ్ళిపోతున్నాడు. మళ్ళా ఎన్నడూ ఈ ఊళ్ళోకి రాడు. నీ గడప తొక్కడు."

"ఏం? ఆడు నా గడప తొక్కకపోతే కొంపలేం అంటుకుపోవు!" అన్నాడు సేఠ్ నిర్లక్ష్యంగా.

"కొంపలేకాదు. దేశమే తగలడిపోతుంది! సేఠ్‌జీ! ఇది ఒక్క ఆనందరావు సమస్య కాదు. ఈ దేశంలో ఉన్న కోట్లాది హరిజనుల సమస్య. తరతరాలుగా మీలాంటి స్వార్థపరుల దోపిడీకి, అణచివేతకు గురికాబడ్డ మాల మాదిగలకు మీలోంచే పుట్టిన ఓ మహాత్ముడు 'హరిజనులు' అని నామకరణం చేస్తే మీరు సహించలేకపోయారు. మీ మతోన్మాదం, జాత్యహంకారం ఆనాడు, యీనాడూ ఎందరో గాంధీలను బలిగొంటూనే ఉన్నాయి. గాంధీలు నేలకొరుగుతూనే ఉన్నారు. కాని అస్పృశ్యత రావణాసురుడి కాష్టంలా రగులుతూనే ఉంది!..."

దూరంగా రిక్షాలో సామాను యెక్కించి సతీసమేతంగా వెళ్ళిపోతున్న ఆనందరావును చూపిస్తూ యాదగిరి సేఠ్‌తో యిలా అన్నాడు:

"అదుగో, వాడు వెళ్లిపోతున్నాడు. అక్కడైనా సుఖంగా సంతోషంగా ఉంటాడు. ఈ ఊళ్ళో వాడికి ఇల్లు దొరకలేదు. ఈ సమాజంలో వాడికి చోటు లేదు."

"పోనీయ్! వాడి ఎంబడి నువుగూడా పో! మీరంతా యీ ఊరొదిలిపెట్టి పోయినా మాకొచ్చిన నష్టమేమీలేదు! ధూ!..." అని నేలమీద కసికొద్దీ ఉమ్మేసి లోపలికి వెళ్ళిపోయాడు సేఠ్‌జీ.

***

ఆనందరావు హరిజనవాడలో అడుగుపెట్టగానే అక్కడి పిన్నా పెద్దా అందరూ ఆదరంతో అతనికి స్వాగతం చెప్పారు. అతని కంటె శాంతకు మరింత ఆనందంగా ఉంది.


# వనిత

ఆగస్ట్ ('85) సంచికలో....

స్వాతంత్ర్య సమరంలో స్త్రీలు
—మాలతీచందూర్ వ్యాసం

★

రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రిణి:
—ప్రతిభా భారతితో గోష్ఠి

★

'మన పతాక' పుట్టుపూర్వోత్తరాలు

★

స్వతంత్ర భారత దేశంలో....
ఆశించినదేమిటి? జరుగుతున్నదేమిటి?
—సచిత్ర వ్యాసం

★

కె. రామలక్ష్మి
కాలానికి వంతెన
(సశేష నవల)

★

ఇంకా....

వాసిరెడ్డి సీతాదేవి - వాస్తవ గాధలు, డా॥ ఆలూరి విజయలక్ష్మి- వైద్యసలహాలు, వింధ్యవాసిని - మాతృహృదయం (ముగింపు భాగం), జలంధర - స్మృతి చిహ్నం (చిన్న నవల), మంగళా కందూర్ - 'అవి ఇవి', ప్రముఖ దంపతులు - విజయలక్ష్మి, నరసింహమూర్తి, బామ్మగారి పేజీ వివాదంపై పాఠకుల అభిప్రాయాలు....ఇవికాక మరెన్నో శీర్షికలతో వెలువడింది.


★

విడి ప్రతి వెల: రూ. 2-50 సం॥ర చందా: రూ. 30-00

చందా॥ ఎం. ఓ ద్వారా గానీ డ్రాఫ్టు ద్వారా గానీ పంపవలసిన

చిరునామా:

వనిత (తెలుగు), చందమామ బిల్డింగ్స్, వడపళని,
మద్రాసు 600026




అక్కడున్న ఓ పెద్దాయన వచ్చి పరామర్శించాడు.

ఆనందరావు యిచ్చిన టీ త్రాగి అతను చెప్పిందంతా విని "చాలా మంచి పని చేశావు బాబూ!" అంటూ అభినందించాడు. కల్లాకపటమెరుగని ఆ పేద ప్రజానీకం, ఆ ప్రశాంత వాతావరణం ఆ దంపతులకు ఎంతో హాయిని, సంతృప్తినీ కలిగించాయి. కొన్ని రోజులు ఉల్లాసంగా గడిచిపోయినై.

ఒకరోజు శాంత భర్తతో "ఏమండీ! ఇవాళ రాములవారి గుడికి వెళ్ళొద్దాం!" అంది.

"ఏమిటి నీకున్నట్టుండి భక్తి పుట్టుకొచ్చింది?" అంటూ ఆశ్చర్యపోయాడు ఆనందరావు.

"ఆ ఏముందిలెండి? మన కష్టాలన్నీ గట్టెక్కి మనకు మంచిరోజులు రావాలని ఆ దేవుడికి స్వయంగా చెప్పుకోవాలనిపించింది!" అంది శాంత చిరునవ్వుతో.

"సరే. కానీ, అలాగే వెళ్ళొద్దాం. అయితే యీ పల్లెలో రామమందిరం లేదు. మనం వదిలిపెట్టొచ్చిన టౌనులోనే వుంది గుడి. మళ్ళా అంతదూరం నువు నడవాల్సివుంటుంది" అన్నాడు.

"తప్పుతుందా? అక్కడికే పోయొద్దాంలెండి!" అంది శాంత చిరునవ్వుతో.

ఇద్దరూ బయలుదేరారు. రిక్షా దొరకక కాలినడక సాగించారు. దారిలో యాదగిరి కలిశాడు. ఆనందరావుకు మంచి కాలక్షేపం జరిగింది.

ఊరి నడిబొడ్డున ఉన్నది రాములవారి గుడి. ఆరోజు శనివారం. దైవదర్శనానికి వచ్చిన భక్తుల రద్దీ చాలా ఎక్కువగా ఉంది.

పూజారి వెంకటాచారి భక్తులను పరిశీలిస్తూ ఒక్కొక్కరినే స్వామి సన్నిధిలోకి ప్రవేశపెడుతున్నాడు. ఆనందరావు, శాంతల వంతు వచ్చింది.

కులం, గోత్రం చెప్పమన్నాడు పూజారి.

కులం హరిజనకులం! గోత్రం? ఏం చెప్పాలో అర్థంగాక "గాంధీ గోత్రం!" అన్నాడు ఆనందరావు భయం భయంగా.

"గాంధీ గోత్రివా? సిగ్గులేదూ ఆ మాటనడానికి? నడునడు వెనక్కి. చెత్త కబుర్లూ నువ్వూను. సతీ సమేతంగా దయచేశావేం? పెద్ద హీరోలా!" అంటూ కళ్ళల్లో నిప్పులు కురిపించాడు పూజారి.

వెనకాలే నిలబడివున్న యాదగిరి ముందుకొచ్చి "అయ్యా పూజారిగారూ! దేవుడిగారికి మా కులాలు, గోత్రాలు యెందుకకంట? ఆయన మిమ్మల్ని అడగ మన్నాడా? లేక తమరే......" అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న యాదగిరికి చెంప "ఛెళ్ళు"మంది. తమాయించుకుని ఎవరా? అని చూసిన యాదగిరికి ఎదురుగా ఆలయ ధర్మకర్త కనిపించాడు. అతన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు యాదగిరి. కారణం ధర్మకర్త ఎవరోకాదు సేఠ్ శరభలింగం గుప్తా!

"మా గుళ్ళోకొచ్చి మా దేవుణ్ణే తిడతావుబే? కులం లేనోళ్ళకి దేవుడూలేడు, దయ్యమూలేదు! నోరు మూసుకుని పొండి బయటకి. ఇంకా యిక్కడ నిలబడ్డారంటే మీ ముగ్గురికీ బొక్కవిరగదన్నిస్తా! ఏమనుకుంటున్నారో ఏమో?" అన్నాడు సేఠ్‌జీ విషం కక్కుతూ.

ఆనందరావుకు, శాంతకు ఏం చేయాలో తోచలేదు. కానీ మరుక్షణంలో ఆనందరావుకు పరిస్థితి అంతా అర్థమయింది.

"మా దేవుడు యిక్కడ ఉంటాడని వచ్చాం! కానీ యిక్కడకు వచ్చాక నీ పాడుముఖం చూడాల్సివచ్చింది!" అన్నాడు ఆనందరావు కోపంగా.

"కులహీనులు, పాపాత్ములు, నాస్తికులు—వీరి ముఖాలు స్వామివారు చూడరయ్యా" అంటూ వివరణ యిచ్చాడు పూజారి.

"మంచిది. మేం పోతున్నాం. అయితే ఆఖరు మాట! దేవుడు మీ సొంతం కాదు! ఇది గుర్తుంచుకోండి! పద యాదగిరీ!" అంటూ శాంతతో సహా బయటకి నడిచాడు ఆనందరావు.

బయటకొచ్చిన తర్వాత యాదగిరి ఇలా అన్నాడు: "మాష్టారూ! మీరిలా ఊరుకుంటే లాభంలేదు. కీలెరిగి వాత పెట్టాలి! చదువుకున్న, ఉద్యోగస్థులమయిన మనకే స్వామిసన్నిధిలోనికి ప్రవేశం లభించలేదంటే యిక అమాయకులు, చదువూ సంధ్యాలేని పేద హరిజనుల మాట వేరే చెప్పాలా? ఇలా ఎంత మందికి ఆలయ ప్రవేశం లేకుండా చేస్తారు? తాడోపేడో తేలాల్సిందే. పదండి పోలీస్ స్టేషనుకి."

***

కొన్ని గంటలు గడిచాయి.

గుడిముందు పోలీస్ జీప్ వచ్చి ఆగింది. జీప్‌లోంచి దిగిన యస్.ఐ.ని, కానిస్టేబుల్స్‌ను చూసి ఆశ్చర్యపోయారు శరభలింగమూ, పూజారీ.

"యూ ఆర్ అండర్ అరెస్ట్!" అన్నాడు యస్.ఐ.

నిర్ఘాంతపోయాడు సేఠ్‌జీ.

"దేనికి? మేం ఏంచేశామని?" అడిగాడు పూజారి.

"హరిజన కులానికి చెందిన ఆనందరావును, శాంతను మీరు గుడిలోకి రానివ్వలేదు. బలవంతంగా బయటకు పంపించారు. అందుకు సాక్ష్యం యాదగిరి. మనిషికి, దేవుడికి మధ్య మీరెవరు? ఒక మనిషికి దేవుణ్ణి చూసే హక్కులేకుండా చేయడానికి మీకు అధికారం ఎవరిచ్చారు?" అనడిగాడు యస్.ఐ.

"ఈ గుడి మాది. ఈ దేవుడు మా సొంతం. ఆనందరావులాంటి వాళ్ళను గర్భగుడిలోకి అనుమతించడాన్ని మా ఆలయ మర్యాదలు అంగీకరించవ్!" అన్నాడు సేఠ్‌జీ మేకపోతు గాంభీర్యంతో.

"అలాగ! సరే! మీకు ఎటువంటి మర్యాదలు జరుగుతాయో అదీ తెలుసుకోండి!" అంటూ సేఠ్‌జీకి, పూజారికి చేతులకు బేడీలు వేశాడు యస్.ఐ.

అరెస్టు చేయబడ్డ శరభలింగం గుప్తా, పూజారి వెంకటాచారిని లాకప్‌లో ఉంచి తర్వాత ఫస్ట్‌క్లాస్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచాడు యస్.ఐ.

విషయమంతా విన్న తర్వాత మేజిస్ట్రేట్ తన తీర్పునిస్తూ ఇలా అన్నాడు:

"మనిషికి, దేవుడికి మధ్య దళారులు, మధ్యవర్తులు అవసరం లేదు. ధర్మకర్తలు, పూజారులు తమ పరిమితులేవిటో తెలుసుకొని మసలుకోవడం అవసరం. ఈ ధర్మకర్త, పూజారి తమ హక్కులను దుర్వినియోగం చేశారు. ఆనందరావు, శాంత, యాదగిరిలకు కులం కారణంగా ప్రవేశం నిరాకరించారు. ఇది నేరం! అంతకు మించి అమానుషం."

పౌరహక్కుల రక్షణ చట్టం క్రింద ధర్మకర్తకు, పూజారికి ఒక్కొక్కరికి వంద రూపాయల జరిమానా విధించబడింది. ఇద్దరికీ చెరొక నాలుగునెలల కఠిన కారాగార శిక్ష కూడా విధించబడింది.

నేరస్థులిద్దరూ జయిల్లో కటకటాలు లెక్కబెడుతూ కూర్చున్నారు.

"అయ్యా! మనం ఆనందరావును వెలివేయబోయాం, కానీ—మనల్నే వాడు వెలివేసినట్టయింది చివరకి" అన్నాడు పూజారి బుర్రగోక్కుంటూ.

"ఆచారీ! మనల్ని వెలివేసింది ఆనందరావు కాదు! చట్టం! చట్టం మనల్ని వెలివేసింది!! చట్టం నిన్నూ, నన్నూ, ఆ దేవుణ్ణి కూడా లెక్కచేయకపోవడం నిజంగా వింతే మరి!" అన్నాడు శరభలింగం నిస్పృహగా నవ్వుతూ.